ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

భద్రాద్రి కొత్తగూడెం

BHADRADRI KOTHAGUDEM

గురువారం, 29 ఫిబ్రవరి 2024



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	34	22
భద్రాద్రి కొత్తగూడెం	36	25



కళ తప్పిన జీవనది

ఎపుడూ గలగలా పారే గోదావరి మూగబోయింది. గతేడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈసారి వేసవి ప్రారంభం కాకముందే జీవనది ఒట్టిపోయింది. ఇసుక తిన్నెలు, రాళ్లగుట్టలతో దర్శనమిస్తోంది. మంగళవారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం నాలుగు అడుగులకు పడిపోవడం గమనార్హం. గతేడాది జూలై 29న 56.1 అడుగుల గరిష్ఠ నీటిమట్టం నమోదు కాగా, అనంతరం వర్షాభావ పరిస్థితులతో నీటిమట్టం క్రమేపి తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలో మార్చి ఆరంభం కాకముందే భద్రాచలం వద్ద గోదావరి ఇసుక తిన్నెలతో దర్శనమిస్తుండటం గమనార్హం. గతేడాది ఫిబ్రవరి 28న 1.9 అడుగుల నీటిమట్టం నమోదైంది.

- భద్రాచలం

చేరికలకు లోకల్ బ్రేక్

- 'హస్తం' అందుకునేందుకు స్థానిక బీఆర్ఎస్ నేతల ఆసక్తి
- తమకు ప్రాధాన్యం తగ్గుతుందని కాంగ్రెస్ క్యాడర్ ఆందోళన



7

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు పార్టీ మారేందుకు ఉబలాటపడుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వారిని చేర్చుకునేందుకు ఆసక్తిగా వున్నా, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కేడర్ మాత్రం బీఆర్ఎస్ నేతల రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వారినిచేర్చుకుంటే తమ ప్రాధాన్యం తగ్గుతుందనేది వారి వాదన. దీంతో జంపింగ్ జపాంగ్‌లకు ఏం చేయాలో తోచడం లేదు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

కేఎంసీలో విజిలెన్స్ తనిఖీలు

- గతంలో నగరంలో చేపట్టిన రూ.వెయ్యి కోట్ల పనులపై ఆరా
- 15 మంది అధికారులు మూడు బృందాలుగా...

7



ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు సుడా (స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) నిధులతో చేపట్టిన రూ.వెయ్యి కోట్ల పనులపై విజిలెన్స్ తనిఖీలు మొదలయ్యాయి. వరంగల్‌కు చెందిన విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ బాలకోటి ఆధ్వర్యంలో 15 మంది అధికారులు మూడు బృందాలుగా ఖమ్మం కార్పొరేషన్‌లో బుధవారం తనిఖీలు ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పనులు చేపట్టిన విషయం విదితమే.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

మాయమై పోతున్నాయి

నియోజకవర్గ కేంద్రమైన వైరాలో రూ.కోట్ల విలువైన నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్‌పీ) మేజర్ కాల్వభూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఎంత మంది పాలకులు మారినా వీటిని పరిరక్షించే నాథుడే కరువయ్యాడు. సుమారు 19.30 ఎకరాల ఎన్నెస్పీ భూములు అన్యాక్రాంతమయ్యాయి. వీటికి సంబంధించిన లెక్కలను అధికారులు నిగ్గుతేల్చాల్సి ఉంది. ప్రైవేట్ వ్యక్తులు ఈ భూములను ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్థలాల పక్కన ఉన్న ప్రైవేట్ వ్యక్తుల ఇళ్లనెంబర్ల ఆధారంగా అనేక మంది ఎన్నెస్పీ స్థలాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. ఈ భూముల విలువ రూ.50కోట్లకు పైగానే ఉంటుంది. అయినా అధికారులు చోద్యం చూస్తూనే ఉన్నారు.



ఎన్నెస్పీ కాల్వపై నిర్మించిన పల్లె దవాఖానా



ఎన్నెస్పీ కాల్వ భూములను ఆక్రమించి నిర్మించిన నివాసాలు

- అడ్డూ అదుపూ లేకుండా వైరాలో ఎన్నెస్పీ భూముల కబ్జా
- ఇప్పటికే కోట్ల రూపాయల విలువైన 19.30 ఎకరాల అన్యాక్రాంతం
- ప్రైవేటు ఇంటి నెంబర్ల ఆధారంగా తప్పుడు రిజిస్ట్రేషన్లు
- బదిలీ చేయకుండానే ప్రభుత్వ అవసరాలకు వినియోగం
- సర్వే చేసి నిగ్గు తేల్చాల్సిన రెవెన్యూ శాఖ

వైరా, ఫిబ్రవరి 28: ఎన్ఎస్‌పి స్థలాలు రకరకాలుగా అన్యాక్రాంతమై పోతున్నాయి. లొసుగులను అధారం చేసుకొని ప్రైవేటు వ్యక్తులు భూముల చెరబడుతుండగా, కొన్ని చోట్ల నీటిపారుదలశాఖ అధికారుల నుంచి బదిలీ కాకముందే ప్రభుత్వానికి చెందిన కొన్ని నిర్మాణాలను చేపట్టడం గమనార్హం. ఈ భూముల వ్యవహారాన్ని నిగ్గుతేల్చాలని కోరుతూ ఇటీవల నీటిపారుదల శాఖ అధికారులు వైరా తహసీల్దార్‌కు ఒక లేఖ రాశారు. వైరా మునిసిపాలిటీలోని స్వతంబజార్‌లో ఎన్నెస్పీ భూమి ఆక్రమణకు సంబంధించి జనవరి 8న స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కలెక్టర్ కార్యాలయం వారు నీటిపారుదలశాఖ అధికారులను వివరాలు అడుగుతూ ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత నీటిపారుదలశాఖ అధికారులు రంగంలోకి దిగి ఈ భూములను నిగ్గుతేల్చాలని కోరుతూ వైరా తహసీల్దార్‌కు ఒక లేఖ రాశారు.

తేలాల్సిన నిజాలెన్నో..

వైరా మండల పరిధిలోని ఎన్నెస్పీ కాల్వలు గతంలో ఎన్ఎల్‌బీసీ ఓఅండ్ఎం సబ్‌డివిజన్-2 టేకులపల్లి నియంత్రణలో ఉండేవి. నీటిపారుదలశాఖ పునర్‌వ్యవస్థీకరణ సమయంలో 2020 డిసెంబరు 31నాటి జీవోనెంబర్ 334ప్రకారం అన్ని నీటిపారుదలశాఖలు ఒకే గొడుగు కిందకు వచ్చాయి. పునర్‌వ్యవస్థీకరణ ఫలితంగా మండలపరిధిలోని ఎన్నెస్పీ కాల్వలు వైరా సబ్‌డివిజన్‌కు అప్పగించారు.

ఎన్నెస్పీ-వైరా మేజర్ కాల్వ వైరా మండల పరిధిలో 8.85 నుంచి 10.190 కిలోమీటర్ వరకు ఉంది. పట్టణీకరణలో భాగంగా ఎన్నెస్పీ మేజర్ పరిధిలోని 21ఆర్, 22ఆర్, 23ఆర్, 24టీఈ మైనర్ ద్వారా సుమారు 300ఎకరాలకు గత 20ఏళ్ల నుంచి సాగునీటి పారుదల నిలిచిపోయింది. ఎన్నెస్పీ వైరా మేజర్ నుంచి ఈ ఆయకట్టును తొలగించేందుకు ప్రభుత్వానికి గత సబ్‌డివిజన్ నుంచి ప్రతిపాదనలు పంపించారు. ఆ తర్వాత ఎన్నెస్పీ వైరా మేజర్, మైనర్ కాల్వ అవసరాల కోసం సేకరించిన 19.30 ఎకరాల భూమి ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నందున ఆ భూమిని వైరా మండల తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేస్తున్నామని, ఆ భూమిని ఇతర ప్రభుత్వ ప్రయోజనాల కోసం వినియోగించేందుకు నీటిపారుదలశాఖకు ఎలాంటి అభ్యంతరాలు లేవని స్పష్టం చేస్తూ 2015 జనవరి 9న అధికారులకు ఎన్‌వోసీ నివేదిక సమర్పించారు. అయితే వైరా మేజర్, మైనర్ కాల్వ ఆయకట్టు తొలగింపు, సేకరించిన 19.30ఎకరాల భూమి బదిలీ ప్రతిపాదనలు 2017 మే 30న ఉన్నతాధికారులకు పంపించారు. కానీ ఆ తర్వాత ఎన్నెస్పీ, తహసీల్దార్ కార్యాలయాల మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాల వివరాలు ఎక్కడా వెలుగులోకి రాలేదు.

ఈ భూమిని నీటిపారుదలశాఖతో ఎలాంటి సంప్రదింపులు చేయకుండానే వైరా రైతువేదికకు, ఎక్సైజ్ కార్యాలయ భవనానికి, పల్లెదవాఖానాకు, పట్టణప్రగతిలో మొక్కలు నాటేందుకు పురపాలకశాఖకు రెవెన్యూశాఖ కేటాయించటంపై నీటిపారుదలశాఖ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కేవీసీఎం డిగ్రీ కాలేజీ రోడ్డులోని ఎన్నెస్పీ కాల్వ భూమిని కొంతమంది ఆక్రమించి నివాసాలతోపాటు ఆలయాన్ని నిర్మించటంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు నీటిపారుదలశాఖ అధికారులు ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి నిర్ధారణకు వచ్చారు. ఎన్నెస్పీ కాల్వ భూమి సరిహద్దులు గుర్తించేందుకు వీల్లేకుండా ఉన్నందున వెంటనే మండల సర్వేయర్‌తో ఎన్నెస్పీ కాల్వ భూములు అలాగే ప్రైవేట్ భూముల సరిహద్దులను మార్క్ చేయాలని కోరుతూ నీటిపారుదలశాఖ అధికారులు రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఎన్నెస్పీ కాల్వ భూముల ఆక్రమణల నిగ్గుతేల్చాల్సి ఉంది.

ఈ విషయమై వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావును వివరణ కోరగా ఎన్నెస్పీ కాల్వ భూముల సరిహద్దులు గుర్తించాలని నీటిపారుదలశాఖ అధికారులు లేఖ రాశారని తెలిపారు. ఆ మేరకు సరిహద్దులను గుర్తించేందుకు సర్వేయర్, గిర్దావర్‌కు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

చేపలవేటకు వెళ్లి శవమయ్యాడు..

- చెరువు మాధారంలో యువకుడి అనుమానాస్పద మృతి
- చెరువు కాపలాదారులే కొట్టి చంపారని గ్రామస్తుల ఆరోపణ
- మృతదేహంపై గొడ్డలితో నరికిన ఆనవాళ్లు
- న్యాయం కోరుతూ మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన
- నష్టపరిహారం ఇచ్చేలా ఒప్పందం..
- సద్దుమణిగిన వివాదం



మృతుడు శివ



పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం

నేలకొండపల్లి, ఫిబ్రవరి 28: నేలకొండపల్లి మండలం చెరువు మాధారంలో చేపల వేటకు వెళ్లిన దాసరి శివ(28) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన తీవ్ర ఉద్రిక్తతకు, ఆందోళనకు దారి తీసింది. చెరువుకు కాపలా వున్న వ్యక్తులే శివను కొట్టి చంపారని గ్రామస్థులు చెబుతుండగా, ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి చనిపోయాడని శివ సోదరుడు దాసరి సాయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చేపల వివాదం నిండు ప్రాణాన్ని బలిగొనగా, ఇదే అదనుగా కొందరు చెరువులో చేపలను యధేచ్ఛగా లూటీ చేశారు.

చెర్వుమాధారం షాజీదా చెరువులో చేపల వేట కొనసాగుతున్నది. అయితే కాంట్రాక్టర్ ఒప్పందాన్ని ఉల్లంఘించి చెరువు పరిధిలోని గ్రామాల్లో చేపలను అమ్మకుండా, పోలీస్ పహారాతో బయటకు తరలించి అమ్ముకుంటున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కొన్ని రోజులుగా వివాదం సాగుతోంది. ఈ క్రమంలో చెరువు కట్టపై కాపలాకుగాను సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గోల్‌తండాకు చెందిన దాదాపు 70మంది యువకులను రప్పించి రాత్రిపూట కాపలాకు పెట్టుకున్నట్టు తెలిసింది. వారు కారం పొడి, కొడవళ్ళు, గొడ్డళ్ళు పట్టుకుని తిరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

ఈ వివాదం ఇలా కొనసాగుతుండగానే, మంగళవారం రాత్రి దాసరి శివ ఇంకొక వ్యక్తితో కలిసి చేపలు పట్టటానికి రహస్యంగా చెరువులోకి దిగినట్లు తెలుస్తున్నది. వీరిని గమనించిన కాపలా వాళ్ళు బోటులో చెరువులోకి వెళ్లి శివపై దాడి చేశారని, శివ అక్కడే పడిపోగా వదిలేసి వెనక్కు వచ్చారని గ్రామస్తులు చెబుతున్నారు. బుధవారం తెల్లవారు ఝామున చెరువులో యువకుడు మృతి చెందాడన్న సమాచారం బయటకు పొక్కటంతో ఒక్కసారిగా ప్రజలు ఆగ్రహం చెందారు. పోలీసులు ఉదయం చెరువు వద్దకు వచ్చి మృతదేహాన్ని బయటకు తీయగా మృతదేహంపై గొడ్డలితో నరికినట్లుగా స్పష్టమైన గాయాలున్నాయి.

ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలికి చేరుకున్న అనంతరం మృతదేహాన్ని ఆటోలోకి ఎక్కించి నేలకొండపల్లికి తరలించటానికి ప్రయత్నించారు. ఆటో కొద్ది దూరం వెళ్లాక మృతుని బంధువులు ఆటోను అడ్డగించి ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. కాంట్రాక్టర్ సంఘటన స్థలానికి రావాలని, నష్ట పరిహారం ఇవ్వాలని, హత్య కేసును నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు.

పోలీసులు కబురు చేయటంతో కాంట్రాక్టర్ సంఘటనా స్థలానికి వచ్చాడు. కాంట్రాక్టర్ రావటంతోనే మృతుని బంధువులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధికారులు రూరల్ సీఐ రాజిరెడ్డిని సంఘటనా స్థలానికి పంపారు. మృతుని బంధువులు, కాంట్రాక్టర్, సొసైటీ ఉపాధ్యక్షుడు, ఓ మాజీ ప్రజాప్రతినిధి చర్చలు జరిపారు. రెండు గంటల అనంతరం మృతుని కుటుంబానికి రూ.4 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మృతదేహం కట్టపైనే ఉండి, పోలీసులు తిరుగుతుండగానే చెరువు లూటీ మాత్రం యథేచ్ఛగా జరిగింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన జాలర్లు, చుట్టుపక్కల గ్రామస్తులు చెరువును లూటీ చేశారు.

నా కోసం ట్రాఫిక్ ఆంక్షలు పెట్టొద్దు...

పోలీసు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 28: ఖమ్మం నగరంలో తాను పర్యటించినప్పుడు ట్రాఫిక్ ఆంక్షలు విధించవద్దని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోలీసుల అధికారులను ఆదేశించారు. నగరంలో బుధవారం పోలీసు అధికారులతో సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. తాను ఏదైనా పర్యటనల్లో పాల్గొన్నప్పుడు సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ఎలాంటి ట్రాఫిక్ ఆంక్షలు విధించవద్దని, వారి రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకూడదని సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో నగర ఏసీపీ రమణమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంచే దిశగా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

- నగరాన్ని పారిశుధ్య సిబ్బంది పరిశుభ్రంగా ఉంచాలి
- ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ నీరజ
- రూ.187.86కోట్ల బడ్జెట్‌కు ఆమోదం



మేయర్ నీరజ

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 28: ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) ఆదాయ వనరులను పెంపొందించే దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, మేయర్ అధ్యక్షతన బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన బడ్జెట్ సమావేశంలో 2023-24 సవరణ రూ.220.54కోట్లు, 2024-2025ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ రూ.187.86 కోట్లతో రూపొందించిన అంచనాలను ఆమోదించారు.

ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని నిధులను సమకూర్చుకొని నగరాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు బాగా పనిచేసి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచితే పాలకవర్గానికి మంచి పేరు వస్తుందన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి ప్రభుత్వం వారికి కనీస వేతనం పెంచిందన్నారు. ప్రతినెలా కార్పొరేషన్ నిధుల నుంచి మొదటిగా వేతనాల చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బడ్జెట్ కేటాయింపులో 10శాతం తప్పనిసరిగా గ్రీనరీ కోసం వినియోగించాలని సూచించారు. గృహ, వాణిజ్య సముదాయాలన్నింటినీ గుర్తించి పన్నుల వసూళ్లను పకడ్బందీగా చేపట్టి ఆదాయాన్ని పెంచాలని ఆదేశించారు. భవన నిర్మాణాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలన్నారు. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మునిసిపల్ సాధారణ నిధుల నుంచి సవరించిన రూ.78.68కోట్లకు ఆమోదం తెలిపారు. అలాగే 2024-25కు సంబంధించి సాధారణ నిధుల నుంచి రూ.80.67కోట్ల బడ్జెట్‌ను ఆమోదించారు.

ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. గ్రీనరీకి కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. కార్పొరేషన్ ఆదాయానికి సంబంధించి పూర్తిస్థాయిలో అద్దెలను వసూలు చేసి ఆదాయం పెంచాలని సూచించారు. కార్పొరేటర్లు నగరంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం

- అందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తాం
- బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్‌చే అవమానాలకు గురయ్యాను
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

6

స'ధనం' మింగిన ఇంటిదొంగ

- నిర్మాణ బాధ్యతలు ఇస్తామంటూ ఎర?
- రూ.20 లక్షలు తీసుకున్న భద్రాద్రి దేవస్థానం అధికారి

7

ఇంటర్ పరీక్షలు షురూ

- కేంద్రాలను తనిఖీ చేసిన ఇరు జిల్లాల కలెక్టర్లు
- ఖమ్మంలో 900 మంది, భద్రాద్రి జిల్లాలో 938 మంది గైర్హాజరు

7

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠినచర్యలు

- డీటీసీపీవో ప్రసాద్
- అనుమతిలేని లేఅవుట్ల పరిశీలన



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న డీటీసీపీవో

ముదిగొండ, ఫిబ్రవరి 28: ముదిగొండలో ఎలాంటి అనుమతి లేకుండా వేసిన లేఅవుట్లను జిల్లా డీటీసీపీవో ప్రసాద్ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని సర్వేనెంబర్ 50లో అనుమతి లేకుండా రోడ్లు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేస్తున్నారని సమాచారంపై ఆయన పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వేనెంబర్ 50, 49మధ్యగల ప్రభుత్వ డొంకను రెవెన్యూ, పంచాయతీ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేసినా, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీటీసీపీవో ప్రసాద్ హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రామారావు, ఎంపీవో సూర్యనారాయణ, ఆర్ఐ వహీదా, పంచాయతీ కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

పక్షం రోజులకే బదిలీ

- ఖమ్మం డీఆర్‌డీవో సన్యాసయ్య భూపాలపల్లికి ట్రాన్స్‌ఫర్
- మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో కామేపల్లి మండలం ఎఫెక్ట్
- మహబూబాబాద్ జిల్లానుంచి బదిలీపై ఖమ్మం వచ్చిన అధికారులకు బదిలీలు



బదిలీ అయిన సన్యాసయ్య

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 29: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఖమ్మం జిల్లాలో ని కామేపల్లి మండలం ఉండటం తో తాజాగా జిల్లాకు వచ్చిన జిల్లా అధికారులకు బదిలీ తప్పలేదు. లోకసభ ఎన్నికల నిర్వహణలో బాగంగా మూడేళ్ల కాల పరిమితదాటిన అధికారుల బదిలీలు చేపట్టారు. మహబూబాబాద్ జిల్లా డీఆర్డీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్ సన్యాసయ్య ఈనెల 14న ఖమ్మం డీఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనను భూపాలపల్లి డీఆర్‌డీవోగా బుధవారం బదిలీ చేశారు. భూపాలపల్లిలో డిప్యూటీ సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న పీ నరేశ్‌ను ఖమ్మం డీఆర్‌డీవోగా బదిలీచేశారు. బుధవారం ఒక్కసారిగా బదిలీ ఉత్తర్వులు రావటంతో పక్షం రోజులకే బదిలీ ఏమిటని జిల్లా స్థాయి అధికారుల్లో చర్చ జరిగింది. దీంతో రాష్ట్ర స్థాయి అధికారులు క్లారిటీ ఇచ్చారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో కామేపల్లి మండలం ఉండటంతో మహబాద్, ఖమ్మం జిల్లాల అధికారుల పనిచేసిన కాలాన్ని పరిగణించారని తెలిపారు. అదేవిధంగా పోస్టింగ్ కోసం వెయిటింగ్ జాబితాలో ఉన్న శిరీషను ఖమ్మం అదనపు డీఆర్డీవో (డ్వామా)కు బదిలీ చేశారు.

ఆధునిక పద్ధతుల్లో స్ట్రాబెర్రీస్ సాగు..

- సంప్రదాయ పంటలకు యువరైతు స్వస్తి
- నూతన సాగుపై దృష్టి
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయ అధికారులు



రైతు నాగరాజు



పంట పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కూసుమంచి, ఫిబ్రవరి 28: వ్యవసాయ సాగులో యువత నూతన పద్ధతులు అవలంబిస్తున్నారు. పాతకాలపు విధానాలకు స్వస్తి పలుకుతున్నారు. సరికొత్త పంటలు సాగుచేస్తున్న వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారు. మండలం లోని కేశ్వాపురం, గోపాలరావుపేట గ్రామాల్లో యువ రైతులు ఎక్కువగానే ఉన్నారు. ఇటీవల గోపాలరావు పేట గ్రామంలో పసుపురంగులో పుచ్చకాయ, క్యాప్సికమ్ ఇతరత్రా పంటలు సాగుచేసి అధికదిగుడులు సాధించిన విషయం తెలిసిందే. ఇదేక్రమంలో కేశ్వాపురం గ్రామంలో షేడ్‌నెట్స్‌లో తక్కువ స్థలంలో స్ట్రాబెర్రీస్ పంటసాగుచేసి ఓయువరైతు విజయంసాధించాడు. కేవలం తక్కువ ఉష్ణోగ్రత కలిగిన ప్రాంతంలోనే ఇవి పండుతాయి.

మండలంలోని కేశ్వాపురం గ్రామానికి చెందిన మందపల్లి నాగరాజు అనే యువరైతు మిర్చి నర్సరీ ఉంది. అయితే ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని లంబసింగి వెళ్లాడు అక్కడ స్ట్రాబెర్రీస్ సాగుచూశాడు. ఆసక్తి పెంచుకుని సాగుచేయాలని సంకల్పించుకుని తొలిప్రయత్నంగా తక్కువ విస్తీర్ణంలో కేవలం ఐదుకుంట ల్లో సాగుచేశాడు. పంటసాగుకు రూ.24వేల ఖర్చువచ్చింది. ఇది కేవలం ఆరునెలల పంట. 45 రోజుల నుంచే దిగుబడులు ప్రారంభం అవుతాయి. ఇప్పటికి కేశ్వాపురం సాగుచేసి మూడున్నర నెలలు అవుతోంది. దీంతో ఇప్పటికి పంటను 500 బాక్సులు దిగుబడి వచ్చిందని ఒక్కో బాక్సు రూ.100 విక్రయించినట్లు రైతు తెలిపారు. లంబసింగికే పంపించినట్లు తెలిపారు. అదేవిధంగా స్ట్రాబెర్రీస్ జామ్ కూడా తయారు చేసినట్లు తెలిపారు.

రైతుకు ఏడీఏ, ఏవో అభినందనలు

మండలంలో నూతనంగా ప్రయోగాత్మకంగా సాగుచేసిన స్ట్రాబెర్రీస్ పంటను కూసుమంచి ఏడీఏ విజయచంద్ర, ఏవో వాణి పరిశీలించారు. నూతన పంటను సాగుచేసిన రైతును అభినందించారు. అతి తక్కువ ఉష్ణోగ్రతలో పండేపంట అయినప్పటికీ తొలిప్రయత్నం చేసి విజయం సాధించిన నాగరాజును అభినందించారు. ఈసారి మరింత విస్తీర్ణంలో పంటసాగుచేస్తానని రైతు నాగరాజు తెలిపారు.

ఉపాధి హామీలో అక్రమాలు

- నిధుల రికవరీకి అధికారుల ఆదేశం
- కొణిజర్లలో ఈజీఎస్ ఓపెన్‌ఫోరం



ఓపెన్‌ఫోరం నిర్వహిస్తున్న అధికారులు

కొణిజర్ల, ఫిబ్రవరి 28: ఏడాదికాలానికి సంబంధించిన ఈజీఎస్ ఓపెన్‌ఫోరంలో ప్రతి గ్రామం నుంచి మొక్కలు చనిపోయాయి అనే అశమే ప్రధానంగా వచ్చిం ది. కొలతలకు సంబంధిం చి మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల నుంచి సుమారు రూ.26వేలు తేడా వచ్చినట్లు నిర్ధారించి అధికారులు రికవరీకి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీని నిర్వహించారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు సంబంధించిన రికార్డులను ఆడిట్ సిబ్బంది ఓపెన్‌ఫోరం వద్ద ఉంచారు. ఆయా గ్రామాల్లో మొక్కలు చనిపోయాయని ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రధానంగా తనిఖీల్లో వెల్లడైంది. మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు సంబంధించి కాల్వల తవ్వకాల్లో తేడాలను గుర్తించారు. తేడా వచ్చిన నగదును తక్షణమే జమచేయాలని అధికారులు సంబంధింత అధికారులకు ఆదేశించారు. ఈ ఓపెన్‌ఫోరంలో డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీనివాస్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ పవన్, అంబుడ్స్‌మెన్ రమేష్, ఎంపీడీవో రోజారాణి, ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ సురేంద్రబాబు, అభిలాష్, ఏపీవో అమ్మాజాన్, ఈసీ సునీల్, శాస్త్రీ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐల బదిలీ

ఖమ్మంక్రైం/ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 28: జిల్లలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ పోలీసుశాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మధిర సీఐగా ఉన్న జె.వసంతకుమార్‌ను మల్టీజోన్ 1కార్యాలయంలో రిపోర్టు చేయాలని, అతనిస్థానంలో సిద్దిపేటలో సీసీఎస్ సీఐగా ఉన్న డి.మధును నియమించారు. అదేవిధంగా వీఆర్ ఖమ్మంలో ఉన్న జి.అశోక్‌ను అశ్వాపురం ఎస్‌హెచ్‌వోగా నియమించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న రవీందర్‌ను మల్టీజోన్ 1కార్యాలయంలో రిపోర్టు చేయాలని తెలిపారు. అశ్వారావుపేట సీఐగా ఉన్న టి.కరుణాకర్‌ను ఏడూళ్లబయ్యారం సర్కిల్‌కు బదిలీ చేశారు. ఖమ్మం సీఎస్‌బీలోఓ ఉన్న కె.జితేందర్‌ను అశ్వారావుపేట సీఐగా నియమించారు. సీసీఎస్2 సీఐగా ఉన్న బత్తుల సత్యనారాయణను వీఆర్ ఖమ్మానికి బదిలీ చేశారు. కొత్తగూడెం త్రీటౌన్ సీఐ మురళీ ఖమ్మం సీఎస్‌బీ - వన్‌కు బదిలీ కాగా, చుంచుపల్లి సీఐ పెద్దన్న కుమార్ మల్టీజోన్ వన్‌కు రిపోర్ట్ చేయనున్నారు. భద్రాచలం సీఐ రాయల వెంకటేశ్వర్లు చుంచుపల్లి సీఐగా నియమితులయ్యారు.

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ

● రెండు నెలల వ్యవధిలో 4822 ఈపెట్టీ కేసులు: కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం ఫిబ్రవరి28: విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ రాత్రి గస్తీపై దృష్టిపెట్టినట్టు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పేర్కొన్నారు. జిల్లాసరిహద్దు ప్రాంతాల మీదుగా గంజాయి, రేషన్‌బియ్యం, ఇసుక రవాణ అరికట్టడానికి పోలీసుయంత్రాగం వాహనాలు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారన్నారు. అదేవిధంగా ర్యాష్‌డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం తాగి వాహనాలునడిపే వారిపై ఈపెట్టీ కేసులు 4822 నమోదుకాగా వీటిలో ఇప్పటి వరకు 1014 కేసుల్లో న్యాయస్థానం జరిమాన విధించిందన్నారు. మరో 3354కేసుల్లో చార్జిషీటు దాఖలు చేశామన్నారు.

సమర్ధవంతంగా విధులు నిర్వహించాలి

● సీపీ సునీల్‌దత్ ● సెంట్రల్ క్రైం స్టేషన్‌ను సందర్శన

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 28: నగరంలోని సెంట్రల్ క్రైంస్టేషన్‌ను బుధవారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నేరాల డిటెక్షన్‌లో సీసీఎస్ మరింత సమర్ధవంతంగా పనిచేయాలని సూచించారు. నేరాలు, దొంగనాలు, దోపిడీలు వాటిని గుర్తించడంలో దర్యాప్తు అధికారులకు అందిస్తున్న సహాయాన్ని నేరస్తుల కదలికలకు సంబం ధించి ముందస్తు సమాచార సేకరణలో సీసీఎస్ పోలీసులు చూపించి న పనితీరును పరిశీలించారు. సీసీఎస్ పటిష్టపరిచేందుక అవసరమైన చర్యలు తీసుకుటామని ప్రాపర్టీ రికవరిపైనా పోలీసులు దృష్టిపెట్టాలన్నారు.

అడిషనల్ డీసీపీగా గణేష్ బాధ్యతల స్వీకరణ

ఖమ్మంక్రైం ఫిబ్రవరి 28: అడిషనల్ డీసీపీగా నియమితులైన పీవీ గణేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సీపీ సునీల్‌దత్‌ను కలిసి పుష్పగుచ్చం అందించారు. ఆయన ఇటీవలే సీసీఆర్బీ ఏసీపీగా బాధ్యతలు నిర్వహిస్తూ ఏడీసీపీగా ఉద్యోగోన్నతి పొంది ఖమ్మం పోలీసుశిక్షణ కేంద్రానరికి బదిలీ అయిన విషయం విదితమే.

రైతుబీమా, రైతు బంధు సమస్యలను పరిష్కరించాలి

ఏన్కూరు, ఫిబ్రవరి28: రైతుబంధు, రైతుబీమా పెండింగ్ సమస్యలను వెంటనే పరిస్కరించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం విజయనిర్మల వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ సమస్యలను వంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం తిమ్మారావుపేట బురదరాఘవాపురం ఏన్కూరులోని ఎరువుల దుకానాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏవో నరసింహారావు ,ఏఈవోలు బాలకృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

5న పండితాపురం సంత వేలం

కామేపల్లి, ఫిబ్రవరి 28: ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక ఆదాయం వస్తున్న కామేపల్లి మండల పరిధిలోని కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీలో గల శ్రీకృష్ణప్రసాద్ పశువుల సంత 2024-25 గాను మార్చి 5న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని గిరిజన తెగకు చెందిన వారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

కానిస్టేబుల్ నాగముత్యానికి ఎస్పీ రోహిత్‌రాజు సత్కారం



కానిస్టేబుల్‌ను సత్కరిస్తున్న ఎస్పీ

దమ్మపేట , ఫిబ్రవరి, 28: దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నాగముత్యంను భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్ తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. ఇటీవలే నాగముత్యం మేడారం జాతరలో బందోబస్తులో విధులు నిర్వహిస్తున్న సమయంలో అక్కడ ఒక వ్యక్తి అకస్మాత్తుగా కిందపడిపోయి కోమాలకి వెళ్లడంతో సమయ స్ఫూర్తితో సీపీఆర్ చేసి ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాడు. దీంతో నాగముత్యాన్ని ఎస్పీ సత్కరించి అభినందించారు. ఎస్పీ మాట్లాడుతు నిత్యం ప్రజలకు అందుబాటులో వుండి సేవలు అందిచంటంలోనే కాకా వైద్యపరంగా కొన్ని విషయాలు పోలీసులు తెలుసుకోవాలని సూచించారు. పోలీసులే కాకుండా సామాన్య పౌరులు ఇలాంటి విషయాలపై అవగాహన కలిగి వుండాలని అత్యవసర సమయంలో బాధ్యతలు నిర్వహించాలని కోరారు.

ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేస్తాం

- అందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తాం
- బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్‌చే అవమానాలకు గురయ్యా
- ఖమ్మం జిల్లా ప్రజలకు జీవితాంతం రుణపడిఉంటా
- మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 28: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని, అందుకోసం ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొని అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మహ్మదాపురంలో సుబ్లేడు క్రాస్‌రోడ్డు వద్ద తెలంగాణ గురుకుల బాలుర పాఠశాలలో సుమారు రూ.5కోట్లతో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, ఇప్పటికే నాలుగు గ్యారంటీలను అమలుచేశామని తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ కూడా నెరవేర్చేందుకు ఎన్ని కోట్లయినా ప్రభుత్వం ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్లరేషన్‌కార్డులుఅందిస్తామన్నారు. గతంలో తనకు ఎటువంటి పదవులు లేకపోయినా ప్రజలు తనను అక్కున చేర్చుకున్నారని, జిల్లా ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తనను అనేక ఇబ్బందులకు, అవమానాలకు గురిచేశారని, ప్రజల ఆశీర్వాదంతో నేడు ఈ స్థాయికి వచ్చానని తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ

బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో సాగునీటి ప్రాజెక్టుల పేరుతో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని, మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ మంత్రులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం వేలాది ఎకరాల అసైన్డు భూములు కబ్జా చేసిందని హైదారాబాదులో వేలాది ఎకరాలు కబ్జాకు గురయ్యాయని తెలిపారు. ప్రతి ఒక్కరికి డబుల్‌బెడ్‌రూం ఇస్తామని ఒక్కరికి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికి ఇళ్ల ఇస్తామన్నారు. ఈసందర్భంగా 30మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందించారు ఈకార్యక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్, ఎంపీపీ మంగిలాల్, తహసీల్దార్ రామకృష్ణ, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి, నాయకలు మద్దినేని బేబి స్వర్ణకుమారి, జడ్పీటీసీ బెల్లం శ్రీను, కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, జొన్నలగడ్డ రవి, రామిరెడ్డి చరణ్‌రెడ్డి, జూకురు గోపాలరావు, ఓర వెంకటేశ్వర్లు, బోడపట్లసునిత, నరసయ్య, ఉపేందర్, ఈఈ తానాజీ , సీఈ శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటే

- విజయసంకల్పయాత్రలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు కాదని ఒక్కటేనని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, వరంగల్ మాజీ ఎమ్మెల్యే మార్తి ధర్మారావులు విమర్శించారు. బుధవారం ఇల్లెందులో బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ గట్టడంలో బీఆర్ఎస్ మెతక వైకరి అవలంబిస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు సీబీఐ విచారణ కోరకపోవటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ నడుమ అవగాహన ఉన్నట్లా.. లేనట్లా.. అన్ని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకలతో ఉన్న ధరణి పోర్టల్‌ను ఇప్పటి వరకు రద్దు చేయకపోవటాన్ని తప్పుపట్టారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని ఆరోపించారు. దేశానికి మోదీ అవసరమని మరో పర్యాయం మోడీని ప్రధాని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, ఇల్లందు నియోజకవర్గ నాయకులు గోపి, సంజీవరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నాళ్ల సోమసుందర్, మిర్యాల వెంకటేశ్వరరావు, మావునూరి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భవిష్యత్‌పై మార్గదర్శకం చేయాలి

- వ్యక్తిత్వ వికాస నిపుణుడు వెంకటరమణ
- ఉమ్మడి జిల్లా సంక్షేమాధికారులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ
- ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 28: సంక్షేమ వసతిగృహాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఎప్పటి కప్పుడు మనోధైర్యం కల్పిస్తూ భవిష్యత్‌పై మార్గదర్శకం చేస్తూ వారికి తోడుగా సంక్షేమాధికారులు నిలవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమ ణ పిలుపునిచ్చారు. ఖమ్మం టీటీడీసీలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా ఎస్సీ సంక్షేమాధికారుల శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ముగింపు సభకు హాజరైన అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ మేధావులు అణిచివేత నుంచి పుడతారని, ప్రభుత్వ ఎస్సీ వసతిగృహాల్లో విద్యాభ్యాసం చేసిన ఎందరో ఈ రోజు ఉన్నత స్థాయిలోకి ఎదిగారని అటువంటి వారి జీవితాలను ఎప్పుడు విద్యార్థులకు వివరిస్తూ వారికి భవిష్యత్‌పై ఆశలు పెంచాలని సూచించారు. విద్యార్థులను రేపటి మంచి పౌరులుగా తీర్చి దిద్దటానికి సంక్షేమాధికారులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. సంక్షేమ వసతిగృహంలోని చురుకైన విద్యార్థులే రేపటి మంచి పౌరులుగా దేశానికి ప్రయోజనకారులుగా మారతారన్నారు. సాంఘీక సంక్షేమశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ, శిక్షణ తరగతుల సమన్వయకర్త ఆనంద్‌కుమార్, తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోటపాడు రుక్మారావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు ఇంటూరి శేఖర్‌కు బెయిల్

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 28: ఆలయ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాల కేసులో ఇటీవల అరెస్టయిన బీఆర్ఎస్ నాయకుడు ఇంటూరి శేఖర్‌కు బుధవారం న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. స్థానిక ఆలయ భూముల్లో అక్రమంగా మట్టిని తరలించారని ఎండోమెంట్ అధికారి ఫిర్యాదుతో పోలీసులు శేఖర్‌తోపాటు చిన్నా వెంకన్న, కొండా వెంకన్న, చింతలపాటి రామకృష్ణ లపై కేసు నమోదుచేసి అరెస్టు చేసి జైలుకు తరలించారు. అనంతరం న్యాయవాది ద్వారా బెయిల్ దాఖలుచేసి వాదనలు వినిపించారు. ప్రభుత్వ ఆస్తులు కొల్లగొట్టిన నిందులకు బెయిల్ ఇవ్వకూడదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు శేఖర్ తో పాటు కేసులో ఉన్న ముగ్గురికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

న్యాయం చేయాలని సస్పెండైన ఉద్యోగుల ధర్నా

● ఏదులాపురం పీఏసీఎస్ ఎదుట ఆందోళన

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 28: మండల పరిదిలోని ఏదులాపురం పీఏసీఎస్‌లో పనిచేస్తు సస్పెండ్ అయిన ఉద్యోగులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు తాళ్లేసితండాలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. 2021లో ధాన్యం కొనుగోళ్లలో చోటుచేసుకున్న అవకతవకల విషయంపై విచారణ జరిపిన అధికారులు నాటి చైర్మన్ ధర్మారెడ్డి, సీఈఓ నరసింహరావుతో పాటుగా మరో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. అది జరిగి కూడా దాదాపు రెండుఏళ్లు గడుస్తుంది. తాము ఏమైనా అవినీతికి పాల్పడితే విచారణ నివేది క ఆదారంగా చర్యలు తీసుకోవడం, ఏమైనా రీకవరీ చేయాల్సి ఉంటే చేస్తామని వారు పేర్కొన్నారు. సహకారం చట్టం ప్రకారం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సస్పెండ్ అయితే ఆరు నెలల తరువాత మళ్లి పోస్టింగ్ ఇస్తారని కానీ రెండేళ్లయినా ఇంత వరకు అధికారులు తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదనవ్యక్తంచేశారు. తమకు న్యాయం చేయాలని న్యాయం జరిగేవరకు సంఘం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లలిత, నరసింహరావు, బేబి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం, కల్లూరు ఆర్డీవోలు బదిలీ

- భద్రాచలానికి దామోదర్‌రావు, కల్లూరుకు శ్రీనివాస్ రాక

భద్రాచలం/కల్లూరు ఫిబ్రవరి 28: భద్రాచలం రెవెన్యూ డివిజనల్ అధికారిగా కొల్లు దామోదర్‌రావును నియమించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది రెవెన్యూ డివిజనల్ అధికారుల బదిలీలను చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో నల్గొండ ఆర్‌అండ్‌ఆర్, ఎల్ఏ యూనిట్-2 ఎస్‌డీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్న దామోదర్‌రావును భద్రాచలం ఆర్డీవోగా నియమించారు. ఇప్పటి వరకు భద్రాచలం ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.మంగీలాల్‌ను భూపాలపల్లి ఆర్డీవోగా నియమించారు. మంగీలాల్ గత ఏడాది ఆగస్టు రెండున భద్రాచలం ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అధికారిక బదిలీల నేపథ్యంలో ఈ బదిలీ జరిగినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

కల్లూరు: కల్లూరు ఆర్డీవో అశోక చక్రవర్తిని నారాయణఖేడ్‌కు బదిలి చేస్తూ రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ నుంచి ఈ మేరకు బుధవారం ఆదేశాలు అందినాయి. కాగా పరకాల ఆర్డీవో కే శ్రీనివాస్‌ను కల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా బదిలీచేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు కొనసాగాయి.

దివంగత రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ 61వ వర్ధంతి

● జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులు అర్పించిన అధ్యక్షులు, కార్పొరేటర్లు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి28: దేశ స్వాతంత్ర్యం కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం గడిపి స్వాతంత్ర్యం అనంతరం తొలి రాష్ట్రపతిగా రెండు పర్యాయాలు (1950, 1957) బాధ్యతలు స్వీకరించి దేశాభివృద్ధికి బాటలు వేసిన మహానేత బాబు రాజేంద్రప్రసాద్ అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కొనియాడారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో బాబు రాజేంద్రప్రసాద్ 61వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్‌తిలక్, భూక్యా బాలాజీనాయక్, బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

అశ్వారావుపేట రూరల్/దుమ్ముగూడెం, ఫిబ్రవరి 28: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించిన సంఘటన మండలంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామన్నగూడెం గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నారు. సమాచారం మేరకు పోలీసులు శిబిరంపై దాడులు జరిపారు. దాడుల్లో ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పేకాట రాయుళ్ల వద్ద నుంచి రూ.18,400 నగదు, మూడు చరవాణీలు, 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుమ్ముగూడెం: మండల పరిది చినబండిరేవు గ్రామశివార్లలో మంగళవారం అర్ధరాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్ల దొరకగా మరికొందరు పారిపోయారు. వారినుంచి రూ.32వేల నగదు, మూడు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెనుబల్లి, ఫిబ్రవరి 28: అనారోగ్యానికి గురై, జీవితంపై విరక్తి చెంది పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పార్థసారధిపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పద్దం సోములు (71) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మందులు వాడినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు పెనుబల్లి ఆసుపత్రికి అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..

సుజాతనగర్: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదయింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన నాళం ధన్‌రాజ్ (20) భార్య కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిపోయింది. క్రమంలో తిరిగి ఇంటికి రావాలంటూ ఆమెకు ఫోన్ చేయగా వచ్చేందుకు నిరాకరించింది. నేపథ్యంలో క్షణికావేశానికి లోనైన ధన్‌రాజ్ ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జుబేదాబేగం తెలిపారు.

పాముకాటుతో మహిళా కూలీ మృతి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 28: పాముకాటుతో వ్యవసాయ మహిళ కూలీ మృతిచెందిన సంఘటన సత్తుపల్లి మండలం బుగ్గపాడులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మహదేవ కుమారి (42) మొక్కజొన్న తోటలో కూలీ పనులకు వెళ్లి పాముకాటుకు గురైంది. తీవ్ర అస్వస్థతకు గురవ్వగా సత్తుపల్లిలోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి భర్త వీరభద్రాచారి, పిల్లలు నితన్, భవ్య ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

పండితాపురంలో రైతుకు పాముకాటు

కామేపల్లి, ఫిబ్రవరి 28: కామేపల్లి మండలం పండితాపురంలో జంగ నారాయణరెడ్డి అనేరైతు మిర్చి తోటలో కూలీలతో పనిచేపిస్తున్నారు. ఈ క్రమంలో కూలీలలకు మంచినీళ్ల పోస్తుండగా గడ్డిలో ఉన్న ఓ పాము రైతు నారాయణరెడ్డిని కాటు వేసింది. వెంటనే అప్రమత్తమై ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు.

కరకగూడెంలో మిర్చి దొంగల హల్‌చల్

కరకగూడెం, ఫిబ్రవరి 28: కరకగూడెం మండలంలో మిర్చి దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మిర్చి దొంగలతో రైతులు భయాందోళన చెందుతున్నారు. రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చిని రాత్రి సమయంలో దొంగలు చోరీ చేస్తున్నారు. మంగళవారం రాత్రి కరకగూడెం గ్రామానికి చెందిన ముద్దం వెంకన్న అనే రైతుకు చెందిన సుమారు రెండు బస్తాల మిర్చిని దొంగిలించారు. సుమారు రూ, 20వేల నష్టం జరిగినట్లు తెలిపారు.

బాల్య వివాహ ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 28: బాల్య వివాహ ఘటనలో బుధవారం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు వివాహం చేసేందుకు యత్నించిన తల్లిదండ్రులు, వరుడు, వరుడి తల్లిదండ్రులపై ఐసీడీఎస్ అధికారులు ఫిర్యాదు చేశారు. సీడీపీవో రోజారాణి ఫిర్యాదు మేరకు బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 28: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన బుధవారం ఖమ్మం పట్టణ పరిధిలో జరిగింది. దానవాయిగూడేనికి చెందిన గోగుల నాగేశ్వరరావు ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తాడు. బుధవారం మధ్యాహ్నం నాగేశ్వరరావు ఆటోకు, తన భార్య నాగమణి కూలి పనులకు, కుమారుడు, కుమార్తె పాఠశాలకు వెళ్లిన సమయంలో ఇంట్లో గ్యాస్‌లీకై ఒక్కసారిగా పేలింది. దీంతో రేకుల ఇంట్లో ఉన్న రూ. 50 వేల నగదు, ఫ్రిడ్జ్, వంట సామగ్రి, ఇతర వస్తువులన్నీ కాలిపోయాయి. అదేవిధంగా ఇల్లుకూడా ధ్వంసం అయింది. వెంటనే ఆ ప్రాంతంలో ఉన్న స్థానికులంతా మంటలను ఆర్పివేశారు.

ఇస్రో పిలుస్తోంది..

9వ తరగతి విద్యార్థులకు ఆహ్వానం ● దరఖాస్తు చేసుకునే ఇంటర్‌నెట్ వెబ్‌పేజీ

- ప్రతిభావంతులకు చక్కని అవకాశం
- క్విజ్, సైన్స్‌ఫేర్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌కు వెయిటేజీ
- మార్చి 20వ తేదీ వరకు అప్లికేషన్లు
- మే రెండో వారంలో ఇస్రోలో శిక్షణ



ఖమ్మం ఖానాపురం హవేలీ, ఫిబ్రవరి 28: పిల్లల ఆలోచనలకు మెరుగులు దిద్దితే.. భావిదితరానికి శాస్త్రవేత్తలుగా మార్చుకోవచ్చు. ఈ విషయాన్ని గుర్తించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు అంతరిక్ష సాంకేతిక, అంతరిక్ష శాస్త్రం, అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా 'యంగ్ సైంటిస్ట్' పేరుతో యువ విజ్ఞాన్ కార్యక్రమం(యువికా) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ మేరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఈ నెల 20వ తేదీ నుంచి అర్హులైన, ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తోంది. 9వ తరగతి చదువుతున్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారని, అరు లైన వారు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

వీరికే అవకాశం

ఇస్రో వెబ్‌సైట్ ఓపెన్ చేసి అందులో యువికా ఆప్షన్ క్లిక్ చేయాలి. అందులో విద్యార్థికి సంబంధించిన వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు జనవరి 1వ 2024 నాటికి తొమ్మిదో తరగతి చదువుతుండాలి. 8వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా 50 శాతం మందికి, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభకు 10 శాతం, సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న వారికి 10 శాతం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ చేసిన వారికి 5 శాతం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 15 శాతం అనుమతి కల్పిస్తారు. మార్చి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి, 28న మొదటి జాబితా, ఏప్రిల్ 4న రెండో జాబితా ప్రకటిస్తారు. మే 12న ఇస్రో కేంద్రాల వద్ద రిపోర్టు చేయాల్సి ఉండగా, 13న యువికా కార్యక్రమం నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులు బస్సులు, రైళ్ల ద్వారా వెళితే వారికి ప్రయాణ రాయితీ కల్పించడంతో పాటు వసతి, బస ఏర్పాటు చేస్తారు.

ఎలా ఉంటుందంటే..

ఇస్రో నిర్వహిస్తున్న యువికా కార్యక్రమంలో భాగంగా ఎంపికైన విద్యార్థులతో పాటుగా, కుటుంబ సభ్యుల్లో ఒకరు అంతరిక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఇస్రోకు చెందిన అహ్మదాబాద్, డెహ్రాడూన్, శ్రీహరికోట, హైదరాబాద్, బెంగళూరు, షిల్లాంగ్, తిరువనంతపురం తదితర కేంద్రాల్లో శిబిరాలు నిర్వహిస్తారు. ఇక్కడ విద్యార్థులకు ప్రముఖ శాస్త్రవేత్తలతో ముఖాముఖీ, చర్చావేదికలు, ప్రయోగశాలల సందర్శన, ముఖ్యులతో సమావేశాల్లో పాల్గొనేందుకు అవకాశమిస్తారు. అంతరిక్ష శాస్త్రం, రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు.





శ్రమైక జీవన సౌందర్యం...

ఎర్రటి ఎండలో మిరపతోట అయినా అమ్మ ఎత్తుకుంటే అది పూలపానుపే.. ఎన్నికష్టాలు వచ్చినా తల్లికి బిడ్డ భారం కాదని.. ఆ మాతృమూర్తి చెరగని చిరునవ్వుతో కూలీ పనులు వచ్చింది. ఓ వైపు పిల్లాడిని చంకన మోస్తూనే మరో మరోవైపు చక చకా మిర్చి ఏరుతూ.. మహిళను శక్తి స్వరూపిణి నిరూపించుకుంది... ఆ మహారాష్ట్ర నారీమణి.

– తల్లాడ

కన్నులపండువగా నిత్యకల్యాణం, సుదర్శన హోమం

భద్రాచలం, ఫిబ్రవరి 28: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బుధవారం సుదర్శన హోమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి నెలా చిత్తా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి సుదర్శన హోమం నిర్వహించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా ముందుగా సుదర్శన పెరుమాళ్లను యాగశాల ప్రాంగణంలోకి తీసుకొచ్చి ఆసీనులను చేశారు. అనంతరం ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, సుదర్శన కలశ స్థాపన, సుదర్శన హవనం, పూర్ణాహుతి, ఆశీర్వచనం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శనస్వామికి ప్రసాద నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు. స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహిచారు. స్వామి వారికి ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తుల



సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సార్చన, నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.

దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పంచాలవరపు కామేశ్వర శర్మ-నాగలక్ష్మి దంపతులు రూ.1,12,000 విరాళంగా అందజేశారు.

నేడు చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 28: ఖమ్మం నగరంలోని స్వర్ణభారతి కళ్యాణ మండపంలో గురువారం సాయంత్రం 4గంటలకు ఆహార, ఆరోగ్య నిపుణుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్‌వలీ వక్తగా 'చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం'పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం కమ్మ మహాజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు తెలిపారు. బుధవారం నగరంలోని స్వర్ణభారతి కళ్యాణ మండపంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో నగరంలోని కోణార్క్ హోటల్లో ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ఆర్‌వి ఫౌండేషన్, రైతు నేస్తం ఫౌండేషన్ సహకారంతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ



మాట్లాడుతున్న రామారావు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మెన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కమ్మ మహాజన సంఘం కార్యదర్శి గొడవర్తి నాగేశ్వరరావు, కోశాధికారి నల్లమోతు రఘు, ఈసీ మెంబర్ బండి మాధవరావు, డి. గుప్తా, బండి నాగేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

నాసా టెస్ట్‌లో సెయింట్‌పాల్స్ విద్యార్థుల ప్రతిభ

భద్రాచలం, ఫిబ్రవరి 28: ఇటీవల నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా) నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో భద్రాచలం సెయింట్‌పాల్స్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న డి.సాయి తేజస్వినిరెడ్డి, నాల్గొవ తరగతి చదువుతున్న వి.భావనప్రియ, మూడో తరగతి చదువుతున్న ఎ.తనుశ్రీ జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులతో పాటు గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ డా.కె.అబ్రహం, ప్రధానోపాధ్యాయురాలు డా.కె.రాధామంజరి తెలిపారు. భవిష్యత్తులో నాసా నిర్వహించే వివిధస్థాయి పరీక్షల్లో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేడు నారాయణరావు జీవితచరిత్ర పుస్తకావిష్కరణ

ఖమ్మం చర్చికాంపౌండ్, ఫిబ్రవరి28: ఎస్సార్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీ భూ విరాళదాత శ్రీరామభక్త గంటేల నారాయణరావు జీవితచరిత్ర పుస్తకావిష్కరణ సభ గురువారం ఎస్సార్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు ఆయన మనుమరాలు, శివచైతన్య ట్రస్టు చైర్‌పర్సన్ కొలిపాక అన్నపూర్ణ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నారాయణరావు జీవితచరిత్ర నేటి వాసులకు తెలియాలని పుస్తకంగా తీసుకొస్తున్నట్టు తెలిపారు.

సాధారణ ప్రసవాలను పెంచాలి

- సిజేరియన్లను సమర్థించేది లేదు
- 36శాతం శిశువులకే ముర్రుపాలు
- 12 ఆసుపత్రులపై నివేదికలకు ఆదేశం
- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



సమీక్షిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 28: జిల్లాలో సాధారణ ప్రసవాలను పెంచే దిశగా ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ ప్రసవాల పెంపుపై వైద్యాధికారులు, ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టులు, డాక్టర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాధారణ ప్రసవాల శాతం పెంచేలా ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలని అన్నారు.

జిల్లాలో 56 ప్రైవేటు ఆసుపత్రుల్లో 2023 సంవత్సరంలో 10,024 ప్రసవాలు జరగగా, ఇందులో 7,748 (77.29%) సి సెక్షన్ (ఆపరేషన్‌తో) జరగగా, 2315 (23.09%)మాత్రమే సాధారణ ప్రసవాలు జరిగాయన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో 80 శాతం వరకు సి సెక్షన్ ఆపరేషన్ల ద్వారా ప్రసవాలు జరుగుతున్నట్లు, ప్రత్యేక కార్యాచరణతో సాధారణ ప్రసవాలు పెంచే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ దిశగా ప్రైవేటు ఆసుపత్రులకు ఎదురవుతున్న సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. సాధారణ ప్రసవాలు చేపట్టేలా, ప్రభుత్వ యంత్రాంగం సహకరించాలన్నారు.

జిల్లాలో సాధారణ ప్రసవాలు పెంపొందించే దిశగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రైవేట్ ఆసుపత్రిలో సైతం సాధారణ ప్రసవాలు జరిగే విధంగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. అధికంగా ఆపరేషన్‌లు నిర్వహించడాన్ని సమర్థించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. గర్భిణుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పసి పిల్లల ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు ప్రసవించిన తర్వాత మొదటి గంట సమయంలో అందించే ముర్రుపాలు కీలక పాత్ర పోషిస్తాయని, అధికంగా సిజేరియన్ ఆపరేషన్ జరగడం వల్ల కేవలం 36 శాతం పిల్లలకు మాత్రమే ముర్రు పాలు అందుతున్నాయని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాలో జరిగే ప్రతి సిజేరియన్ సంబంధించి సమగ్ర వివరాలతో నివేదిక అందించాలన్నారు. 12 ఆసుపత్రుల్లో ఎక్కువగా సిజేరియన్ కాన్పులు జరగడం గమనించామని, దీనిపై విచారణ నిర్వహించి నివేదిక అందించాలన్నారు. సాధారణ ప్రసవాల శాతం పెరగని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమీక్షలో జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ సుబ్బారావు, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంవో అమర్‌సింగ్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ బాబు రత్నాకర్, డాక్టర్ రాధిక, ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సత్తుపల్లి, ఫిబ్రవరి28: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి బాటసారులు, వాహనదారులు క్షేమంగా ఇంటికి చేరాలని కల్లూరు ఏసీపీ ఏ.రఘు సూచించారు. బుధవారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని రద్దీ ప్రాంతాలను పట్టణ సీఐ టి కిరణ్‌తో కలిసి పరిశీలించారు. రింగ్‌సెంటర్, పాత సెంటర్ల వద్ద ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పాతసెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నళ్లను పునరుద్ధరించాలని మునిసిపల్ కమిషనర్‌ను లేఖ ద్వారా కోరినట్లు తెలిపారు. రోడ్డుపైకి వచ్చేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాటసారులు జీబ్రాక్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలన్నారు.



ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రఘు



ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఖమ్మం కార్పొరేషన్‌లో విజిలెన్స్ తనిఖీలు

గతంలో చేసిన రూ.వెయ్యి కోట్ల పనులపై ఆరా

ఖమ్మం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతిప్రతినిధి): గత ప్రభుత్వ హయాంలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు సుడా నిధులతో చేపట్టిన రూ.వెయ్యికోట్ల పనులపై విజిలెన్స్ తనిఖీలు మొదలయ్యాయి. వరంగల్‌కు చెందిన విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ బాలకోటి ఆధ్వర్యంలో 15మంది అధికారులు మూడు బృందాలుగా ఖమ్మం కార్పొరేషన్‌లో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఇంజనీరింగ్‌తో పాటు పలు విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం కార్పొరేషన్, సుడా(స్తంబాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)పరిధిలో సుమారు రూ.వెయ్యి కోట్లతో ఖమ్మం నియోజకవర్గంలో అబివృద్ధి పనులు జరిగాయి. రోడ్లు, డ్రెయినేజీలు, మిషన్‌భగీరథ, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, మోడల్ మార్కెట్లు, ఖమ్మం కార్పొరేషన్ భవనం, లకారం అభివృద్ధి పనులు, గోళ్లపాడు ఛానల్ నిర్మాణం, కొత్తబస్టాండ్‌తో పాటు ఖమ్మంలో మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్రాజెక్టు ఇలా పలు విభాగాల ద్వారా పనులు నిర్వహించారు. అయితే ఈ పనుల కేటాయింపు, టెండర్ల ఖరారు, అధికంగా ఎస్టిమేషన్లు, నాణ్యత లోపాలు, ఇష్టానుసారంగా బిల్లులు చెల్లింపు, కావాల్సిన కంపెనీలకే పనులు కట్టబెట్టడం వంటి ఆరోపణలపై ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ బృందం బుధవారం ఖమ్మం నగరానికి చేరుకుని కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం, డ్రాయింగ్ విభాగం, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ తదితర విభాగాల్లో ఫైళ్లను తనిఖీ చేశారు.

గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, నిధులు ఖర్చు, చెల్లింపులు, కాంట్రాక్టు పొందిన సంస్థల గురించి ఆరాతీశారు. అభివృద్ధి పనుల కోసం పెట్టిన నిధుల లెక్కలు తీసుకున్నారు. మొత్తం పనులపై కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించారా లేదా అన్నదానిపై విచారణ ప్రారంభించారు. అలాగే కార్పొరేషన్ పరిధిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై కూడా విజిలెన్స్ బృందం ఆరాతీసింది.



డీసీవో మురళీధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జిల్లా సహకార అధికారికి సన్మానం

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 28: ఖమ్మం జిల్లా సహకార అధికారి (డీసీవో) మురళీధర్‌ను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన పాలకవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. డీసీవో మురళీధర్ మొదటిసారిగా సమావేశానికి వచ్చిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరావు, పాలకవర్గ సభ్యులు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు షురూ

- కేంద్రాలను తనిఖీ చేసిన ఇరు జిల్లాల కలెక్టర్లు
- ఖమ్మం జిల్లాలో 900 మంది, భద్రాద్రి జిల్లాలో 938 మంది గైర్హాజరు
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ఖమ్మం ఖానాపురం హవేలి/కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి) ఫిబ్రవరి 28: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో 70కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 19,499 మంది విద్యార్థులకు 18,599 మంది పరీక్షకు హాజరుకాగా 900 మంది గైర్హాజరయ్యారు. వీరిలో 16,919మంది జనరల్ విద్యార్థులకు 16,286మంది పరీక్షకు హాజరయ్యారు. 633మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 2580 మందికి 2313 మంది విద్యార్థులు హాజరవ్వగా 267మంది గైర్హాజరయ్యారని డీఐఈవో కె. రవిబాబు తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదు. 'నిమిషం' నిబంధన అమల్లో ఉండడంతో విద్యార్థులంతా గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించారు. కలెక్టర్ వీపీ గౌతమ్ పిండిప్రోలులోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. తొలిరోజు జిల్లాలోని 35 పరీక్షా కేంద్రాలను సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించారు. సమీపంలోని ఎక్స్‌రాక్స్ సెంటర్లను మూసివేయించారు.

భద్రాద్రి జిల్లాలో 938మంది గైర్హాజరు

భద్రాద్రి జిల్లాలో తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 10,771మంది విద్యార్థులకు 9,833 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 938మంది విద్యార్థులు గౌర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 8,227మందికి 7,828మంది పరీక్షకు హాజరవ్వగా 399 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 2,544 మందికిగాను 2,005మంది హాజరయ్యారు. 539 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. కొత్తగూడెం సింగరేణి ఉమెన్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల పరిశీలించారు. రామవరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ రోహిత్ సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ అధికారి సులోచనా రాణి, సింగరేణి ఉమెన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.





చేరికలకు లోకల్ బ్రేక్

- కాంగ్రెస్‌లో చేరేందుకు స్థానిక బీఆర్ఎస్ నేతల ఆసక్తి
- తమకు ప్రాధాన్యం తగ్గుతుందని క్యాడర్ ఆందోళన

ఖమ్మం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి చెందివారు ఉండగా స్థానిక సంస్థల ప్రతినిధులు మాత్రం బీఆర్ఎస్‌కు చెదిన వారు ఉండడం అధికార పార్టీకి ఇబ్బందిగా మారింది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఏ కార్యక్రమం చేపట్టినా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం సమాచారం పంపాల్సి రావడంతో ఇది అధికార పార్టీ నేతలకు కొంత ఇబ్బందికరంగా మారినట్లు చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థల్లో ఖమ్మంకార్పొరేషన్ మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, సత్తుపల్లి, మధిర మునిసిపల్ చైర్మన్‌లతో పాటు పలువురు కౌన్సిలర్లు, అలాగే ఉమ్మడి జిల్లాలో మెజారిటీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, జడ్పీచైర్మన్‌లు కూడా బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారు. వీరందరికీ ప్రోటోకాల్ నిబంధనలు వర్తిస్తున్నాయి. దీంతో అధికారులు కూడా స్థానికంగా మంత్రులు, ఎమ్మెల్యేల కార్యక్రమాలు ఉన్నప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్న ప్రజాప్రతినిధులకు కూడా చెప్పక తప్పడంలేదు. ఇటీవలే సర్పంచ్‌లు పదవీ కాలం ముగియడంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలకు కొంత ఉపశమనం కలిగింది. గ్రామాల్లో ఏ కార్యక్రమం చేపట్టినా సర్పంచ్ అధ్యక్షత వహించాల్సి ఉండేది. బీఆర్ఎస్‌లోని సర్పంచ్‌లు అధ్యక్ష స్థానంలో ఉండి కార్యక్రమాలు నిర్వహించడం అధికార పార్టీ నేతలకు ఇబ్బందికరంగా ఉండేది. ఇప్పుడు సర్పంచ్‌లు లేకపోవడంతో ప్రత్యేక అధికారులు గ్రామ పాలన వ్యవహారాలు చూస్తున్నారు. ఇక మండలస్థాయిలో ఎంపీపీలు జడ్పీటీసీలు, మునిసిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, చైర్మన్లలో చాలామంది బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్నిచోట్ల కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు అధికార పార్టీలో చేరుతున్నారు.

కొత్తగూడెం మునిసిపాలిటీలో మేజర్ సభ్యులంతా కాంగ్రెస్ గూటికి చేరారు. అయితే అక్కడ స్థానికంగా కాంగ్రెస్‌కు ఎమ్మెల్యే లేకపోవడంతో అడ్డుచెప్పేందుకు ఇబ్బందులు లేవు. కొత్తగూడెం, భద్రాచలం మినహా మిగిలిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కొంత మంది బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక ప్రతినిధులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఇప్పుడు పార్టీ మారేందుకు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఎంపీపీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ముందుకు వస్తున్నా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కేడర్ మాత్రం బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు ఎవ్వరూ రావొద్దని హుకుం జారీచేస్తున్నారు. అయితే ఎంపీపీలు, జడ్పీటీసీలు, మునిసిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లను పార్టీలో చేర్చుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు భావిస్తున్నా స్థానిక కేడర్ మనోభావాలను దృష్టిలో ఉంచుకొని పార్టీలోకి ఆహ్వానించలేకపోతున్నారు. దీంతో చాలామంది పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నా మారలేకపోతున్నారు. ఖమ్మం మునిసిపల్ మేయర్‌తో పాటు ఇతర చోట్ల మునిసిపల్ చైర్మన్లు, జడ్పీచైర్మన్, ఎంపీపీ పదవులను కాంగ్రెస్ పార్టీ దక్కించుకోవాలంటే కార్పొరేటర్లు, మునిసిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల బలం కావాల్సి ఉంది. వీరిని పార్టీలోకి రప్పించుకుంటేనే కీలకమైన బీఆర్ఎస్ నేతల పీఠాలు కాంగ్రెస్‌కు దక్కే అవకాశం ఉంది. లేదా ఆ పదవిలో ఉన్న నాయకులను పార్టీలోకి తెచ్చుకోవడం ద్వారా స్థానికంగా పరిపాలన కూడా కాంగ్రెస్ చేతిలోకి వచ్చే అవకాశం ఉంది. కానీ స్థానికంగా క్యాడర్ వ్యతిరేకతతో చేరికలు ముందుకు సాగడం లేదు. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో స్థానిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అధికార పార్టీ గూటికి చేరే అవకాశం కనిపిస్తోంది.

స'ధనం' మింగిన ఇంటిదొంగ

- నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామంటూ ఎర?
- రూ.20 లక్షలు తీసుకున్న దేవస్థానం అధికారి..

భద్రాచలం ఫిబ్రవరి 28: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం పరిధిలో ఉన్న ఒక సదనం నిర్మాణ బాధ్యతలను అప్పగిస్తానంటూ దేవస్థానంలో పనిచేసే అధికారి ఒకరు.. ఓ ఆధ్యాత్మిక బృంద సభ్యులకు ఎర చూపినట్లు సమాచారం. సదరు వ్యక్తుల నుంచి రూ.20లక్షలు గుట్టుచప్పుడు కాకుండా తీసుకొని మాట్లాడకుండా ఉండడంతో వారు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఇదంతా మూడేళ్ల క్రితం జరిగిన విషయంగా తెలిసింది. ఈ క్రమంలో ఆ సదనం నిర్మాణ బాధ్యతలను దేవస్థానమే స్వయంగా చేపట్టడంతో సమస్య మరింత ముదిరినట్లు సమాచారం. వాస్తవానికి భద్రాది దేవస్థానం అధికారులు ఆ సదనంలో 30గదుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి ఇందుకోసం దాతల నుంచి విరాళాలు సేకరించాలని భావించారు. ఈ క్రమంలో సదరు సంస్థ సభ్యులు తామే విరాళాలు సేకరించి నిర్మాణం చేపడతామని దేవస్థానం వద్ద ప్రతిపాదించినట్లు ప్రచారం సాగుతోంది. దీనికి దేవస్థానం అధికారులు విముఖత చూపి, తామే భక్తుల నుంచి విరాళాలు సేకరించి దాతల పేరిట సదనం నిర్మిస్తామని పేర్కొన్నట్లు వినికిడి. ఈ నేపథ్యంలో 30 గదుల సదనం నిర్మాణం మూడున్నర కోట్లు అంచనాతో చేపట్టగా పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తమకు నిర్మాణ బాధ్యతలను ఇప్పించకపోవడంతో పాటు తమ వద్ద తీసుకున్న డబ్బులు సైతం ఇవ్వకపోవడంతో వారు ఇటీవల వచ్చి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో తొలి విడతలో రూ.ఏడు లక్షలు చెల్లించిన సదరు అధికారిని బుధవారం ఆ సంస్థ సభ్యులు దేవస్థానం కార్యాలయం వద్దకు వచ్చి డబ్బులు చెల్లించాలని మరోసారి తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో దేవస్థానం పరిధిలోని ఒక సత్రంలో వారిని ఉండమని చెప్పినట్లు వినికిడి. చెక్కు ఇవ్వబోగా తమకు నగదే కావాలని పట్టుబట్టడంతో రూ.13 లక్షలు దేవస్థానంలో పనిచేసే తన సహ ఉద్యోగితో కలిసి అందజేసినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. కాగా బుధవారం దేవస్థానం కార్యాలయం వద్ద జరిగిన ఈ తతంగం వివరాలు దేవస్థానం సీసీ కెమెరాలు నిక్షిప్తమైనట్లు సమాచారం. ఈ విషయమై దేవస్థానం అధికార వర్గాలు ఇప్పటివరకు ఎటువంటి వ్యాఖ్యలు చేయడం లేదు.

షాదీ ముబారక్ చెక్‌ను అందజేసిన ఎమ్మెల్యే


చెక్కును అందజేస్తున్న పాయం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 28: మణుగూరుఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో బుధవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎస్‌కే రేష్మాకు మంజూరైన షాదిముబారక్ చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి పేద ప్రజలకు, మహిళలకు వచ్చే ప్రతీ సంక్షేమ పథకం నియోజకవర్గంలోని ప్రతీ ఒక్కరికి అందేలా కృషి చేస్తానన్నారు. తొలుత రేష్మాకు శుభాకాంక్షలు తెలిపి తన వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడి బాబు, వెంకన్న, బాబ్‌జానీ, డీటీ కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ డే

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 28: మండలవ్యాప్తంగా పలు పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా వేడుకలు జరిపారు. అశ్వారావుపేటతో పాటు పలు పాఠశాలల్లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ అంశాలపై తయారుచేసిన వస్తువులు ప్రదర్శించగా అవి ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు హరిత, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, చలపతిరావు, మధుసూధనరావు, ప్రసాద్, విష్ణుప్రియ, అంజలి, రామకృష్ణ, నాగరాజు, రజితతో పాటు పలువురు పాల్గొన్నారు.

పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి:ఎమ్మెల్యే

అన్నపురెడ్డిపల్లి: మారుతున్న కాలానికగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తొలి అడుగు ఫౌండేషన్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌ను ఎమ్మెల్యే జారే, డీఈవో వెంకటేశ్వరచారి సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించారు. జిల్లా వ్యాప్తంగా 80 పాఠశాలల నుంచి దాదాపు 300మంది విద్యార్థులు తమ ప్రదర్శనలను ప్రదర్శించారు. ఆయా అంశాల్లో ప్రతిభ కనబరిచిన 12మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, తొలి అడుగు ఫౌండేషన్ ఛైర్మన్ రాము, అధ్యాపకులు విజయ్‌బాబు, అచ్చయ్య, శ్రీనివాస్, నాగరాజు, పండరీనాథ్, మధుసూధన్, తహసీల్దారు జగదీశ్వరప్రసాద్, ఎంఈవో సత్యనారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

శాస్త్రీయ అవగాహనను పెంచుకోవాలి

జూలూరుపాడు: శాస్త్ర, సాంకేతిక రంగాలు ప్రపంచాన్ని శాసిస్తున్న తరుణంలో విద్యార్థులు చిన్న తనం నుంచే శాస్త్రీయ అవగాహనను పెంచుకొని బాల శాస్త్ర వేత్తలుగా ఎదగాలని జూలూరుపాడు ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని పలు పాఠశాలల్లో సైన్స్ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో సీవీ రామన్ చిత్ర పటాలకు ఉపాధ్యాయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూలూరుపాడులోని సాయిఎక్స్‌లెంట్ పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ప్రారంభించారు. మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైన్స్‌ఫెయిర్‌లో గెలుపొందిన విజేతలకు జూలూరుపాడు సీఐ ఇంద్రసేనా రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గుగులోత్ వెంకట్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య, సాయిఎక్స్‌లెంట్ పాఠశాల కరస్పాండెంట్ ఎ.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ శారదదేవి, ఉపాధ్యాయ సిబ్బంది హసేన్స్, శివకుమారి, అనిత, నబీనా, భాను, సత్యావతి, జమున, దుర్గా భవానీ, సంజీవరావు, గీత, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో..

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: పట్టణంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సెమినార్ కార్యక్రమాన్ని తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్సెస్ (టిఏఎస్)- టిఎస్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా (ఎన్ఐటి) వరంగల్ జోనల్ -4 కో-ఆర్డినేటర్ కె.లక్ష్మారెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ బి.తిరుపతిరావు, అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: నరసాపురం జిల్లా పరిషత్, కేరేగుబల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నతపాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులు ఆసక్తికరమైన సైన్స్ అంశాలను ప్రదర్శించారు. క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. నరసాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో పది విద్యార్థులకు రావూరి సత్యనారాయణ మెమోరియల్ ట్రస్టు వారు పరీక్ష అట్టలు, పెన్నులను టీచర్ రావూరి రాంమోహనాచారి అందజేశారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలలో రాణించాలి

ఇల్లెందుటౌన్: శాస్త్ర, సాంకేతిక రంగాలలో విద్యార్థులు రాణించాలని మునిసిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం ఇల్లెందు పట్టణంలోని మార్గదర్శి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ఎగ్జిబిట్స్.. పరిశీలించిన అధికారులు


జూలూరుపాడు సాయి ఎక్స్‌లెంట్ పాఠశాలలో


పరిశీలిస్తున్న ఇల్లెందు మునిసిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి


అన్నపురెడ్డిపల్లిలో బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే


కొత్తగూడెంలో లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గద్దెలకు చేరుకున్న సారలమ్మ


సారలమ్మను తీసుకొస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 28:మండలంలోని మారాయిగూడెం సమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా రెండో రోజైన బుధవారం ఒక పొద్దు, దేవత నిశానులు, సారలమ్మను గుడికి తోడ్కొని వచ్చే కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పూర్తి గిరిజన సంప్రదాయాన్ని అనుసరించి సారలమ్మను మేళతాళాలు, డప్పు నృత్యాల నడుమ గద్దెలపైకి తెచ్చారు. ఈ సందర్భంగా శివసత్తులు పూనకాలు పట్టారు.

మణుగూరు కోర్టులో తనిఖీలు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 28 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు జిల్లా జడ్జీ శ్యామశ్రీ మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో బుదవారం తనిఖీలు నిర్వహించారు. తొలుత అడిషనల్ జిల్లా జడ్జీ శ్యామశ్రీకి మణుగూరు మెసిస్ట్రేట్ ఎం వెంకటేశ్వర్లు సింబందితో కలసి పుష్పగుచ్ఛం అందజేయగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులచే పుష్పగుచ్ఛం అందజేసి అదనపు జిల్లా జడ్జికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో అదనపు జడ్జిచే మొక్క నాటించారు. అనంతరం తనిఖీల్లో బాగంగా కోర్టుకు సంబంధించిన అటెండెన్స్ రిజిస్టర్, కాస్ లిస్టలతోపాటు కాపీయింగ్ సెక్షన్, రికార్డు రూంకు, కోర్టు సెక్షన్, స్టెనోకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కాల్ వర్క్‌లో రోజు వారి కేసుల వివరాలను మెజిస్ట్రేట్‌ను అడిగి తెలుసుకున్నారు. కాల్ వర్క్ నిర్వహణపై మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లుకు పలు సూచనలు చేసారు. కేసుల సత్వర పరిష్కారానికి, పెండింగ్ కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను ఆదేశించారు. అనంతరం కోర్టు ఆవరణ అసాంతం పరిశీలించి విడివిడిగా ఉన్న కోర్టుకు సెక్షన్‌లు, నిర్వహించే పనులను అడిగి తెలుసుకున్నారు. సీఐ సతీష్‌కుమార్ జడ్జి శ్యామశ్రీని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కోర్టు సిబ్బందిని, కోర్టు కానిస్టేబుల్‌లను, కోర్టు అటెండర్‌లను పరిచయం చేసుకున్నారు. మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్‌లు ఈ సందర్భంగా జడ్జీ శ్యామశ్రీని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ దుర్గబాయ్, బార్ అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు, న్యాయవాదులు చిర్ర రవికుమార్, విజయ్, సర్వేశ్వరరావు, పోశం భాస్కర్, రుద్ర వెంకట్, సాంబ, శైలజ, సావిత్రి, కవిత, రామ్మోహన్‌రావు, నాగార్జునరెడ్డి, అన్వేష్ కోర్టు సిబ్బంది రమేష్, రేఖ, కోర్టు కానిస్టేబుల్‌లు మురారి, కిషోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న అదనపు జిల్లా జడ్జి శ్యామశ్రీ

టైలర్ల సమస్యలు పరిష్కరించాలి

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 28: టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పాలకులు కృషిచేయాలని పలువురు నాయకులు కోరారు. అశ్వారావుపేటలో బుధవారం టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టైలర్స్ ఆద్యుడు ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు టైలర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మాసేవాసదనంలో వృద్దులకు పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ టైలర్లు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వాలు రుణాలను మంజూరు చేయాలని కోరారు. టైలర్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టైలర్ల సంఘం అధ్యక్షు కార్యదర్శులు శ్రీనివాసరావు, విత్తం లక్ష్మీ, గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, సమ్మయ్య, సాంబశివరావు, భగవాన్ నారాయణ, మౌలాలీ, సిద్దు, సంఘం బాధ్యులు అప్పారావు, శ్రీను,సత్యప్రసాద్, షైబుబీ, స్వప్న, నారాయణ, పార్టీల నాయకులు ప్రకాశరావు, సలీంతో పాటు పలువురు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ జాతర ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 28: మండలంలోని నారాయణపురంలో వేంచేసి ఉన్న కట్టమైసమ్మ ఆలయంలో 13వ వార్షిక జాతర మహోత్సవాలు బుధవారం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జాతర వేడుకలు జరగనున్నాయి. ఉదయం 6గంటలకు గ్రామతోరణంతో పూజలు ప్రారంభించారు. పలువురు దంపతులు పీటల మీద కూర్చుని పూజలు నిర్వహించారు. ఉదయం పది గంటల నుంచి ఆలయం వద్ద భజనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

విలువలను కాలరాస్తున్న బీజేపీ

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 28: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ నాయకులు గోకినేపల్లి ప్రభాకర్ అన్నారు. ఖమ్మంలో మార్చి 3వ తేదీ నుంచి జరిగే జాతీయ ఐక్యతా మహాసభల విజయవంతాన్ని కోరుతూ బుధవారం అశ్వారావుపేట మండలంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వినాయకపురంలో ప్రభాకర్ జెండాను ఊపి ర్యాలీ ప్రారంభించారు. వినాయకపురం, ఊట్లపల్లి మీదుగా అశ్వారావుపేటకు చేరుకున్న ర్యాలీ పట్టణంలోని పురవీధుల్లో సాగింది. అనంతరం మాస్‌లైన్ నాయకులు కంగాల కల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బలమైన విప్లవ పార్టీల నిర్మాణం ఎంతో అవసరమన్నారు. మార్చి5న జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, మల్లేశ్, అర్జున్, లక్ష్మణరావు, మడకం రామకృష్ణ పాల్గొన్నారు.

నగదు బదిలీకి కేవైసీ తప్పనిసరి

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 28: పీఎం కిసాన్ పథకంలో భాగంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు పడాలంటే ఆధార్ కేవైసీ, ఎన్‌పీసీఐ తప్పనిసరని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు తెలిపారు. గంగోలు రైతువేదికలో బుధవారం మూడు మండలాల ఏఈవోలతో సమావేశం నిర్వహించారు. అర్హులైన రైతులందరూ రైతువేదికల్లో లేదా మీసేవ, సీఎస్‌సీ కేంద్రాల్లో కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఏఈఓల ఫీల్డు సర్వేను సక్రమంగా చేయాలని అన్నారు. ప్రగళ్లపల్లిలో పంట పొలాలను పరిశీలించారు. ఏడీఏ సుధాకర్‌రావు, ఏఓలు నవీన్‌కుమార్, అనీల్‌కుమార్, శివరాంప్రసాద్, ఏఈఓలు పాల్గొన్నారు.

విద్యార్థినుల అభ్యున్నతే ‘రోటరీ’ లక్ష్యం

బూర్గంపాడు, ఫిబ్రవరి 28: విద్యార్థినుల అభ్యున్నతే రోటరీ సంస్థ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ భద్రాచలం ఆధ్వర్యంలో నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులకు బుధవారం సైకిళ్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి సతీమణి రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా ప్రథమ మహిళ అన్నపూర్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యదుసింహరాజు, రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం రివర్ సైడ్ ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ రమేష్‌బాబు, పూర్వ అధ్యక్షులు మంగళగిరి హనుమంతరావు, సభ్యులు రామచంద్రారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అశ్రమ పాఠశాలలో అదనపు గది ఏర్పాటు

బూర్గంపాడు, ఫిబ్రవరి 28: బూర్గంపాడులోని గిరిజన ఆశ్రమ పాఠశాల(బాలురు)లో హైదారాబాద్‌కు చెందిన సమా రిటర్న్ పర్ ది నేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అదనపు గదిని నిర్మించారు. రూ.2లక్షల 10వేల వ్యయంతో నిర్మించిన గదిని బుధవారం భద్రాచలం ఐటిడిఎ డిప్యూటి డైరెక్టర్ మణెమ్మ ప్రారంభించారు.

భద్రాచలం సీఐగా సంజీవరావు



భద్రాచలం, ఫిబ్రవరి 28: భద్రాచలం సీఐగా సంజీవరావును నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వరకు వరంగల్ షీ టీమ్ సీఐగా ఉన్న ఆయన వరంగల్ ఐజీ అటాచ్‌మెంట్‌లో ఉన్నారు. ఈ క్రమంలో భద్రాచలం సీఐగా నియమిస్తూ బదిలీ చేశారు. ఈ వారంలో సంజీవరావు భద్రాచలం సీఐగా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. భద్రాచలం సీఐగా ఇటీవలె బాధ్యతలు చేపట్టిన ఆర్.వెంకటేశ్వర్లను బదిలీ చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంబంధాలపై సెమినార్

భద్రాచలం, ఫిబ్రవరి 28: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంబంధాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ మోహన్‌రావు, వ్యక్తిత్వ వికాస నిపుణులు టి.సుధీర్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సుహృంద్భా వాతావరణం ఏ విధంగా ఉండాలి, అభివృద్ధికి ఏ విధంగా పరస్పరం సహకరించుకోవాలి తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా. జాన్‌మిల్టన్, అధ్యయన సంస్థ ఛైర్మన్ డా. గంధం సుబ్బారావు, జాయింట్ కార్యదర్శి టి.రాజశేఖర్ పాల్గొన్నారు.

జీవాలలో మశూచీ నివారణకు వ్యాక్సిన్ పంపిణీ

జూలూరుపాడు, ఫిబ్రవరి28: గొర్రెల్లో మచూచీ వ్యాధిని నివారించేందుకై పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వ్యాక్సిన్‌ను అందిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.పురందర్ తెలిపారు. బుధవారం జూలూరుపాడులోని పశు వైద్య శాలను ఆయన సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్‌లను పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. పశువులకు సోకుతున్న వ్యాధులు, కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలూరుపాడు మండలంలో 24 పంచాయతీల పరిధిలో 24 వేల జీవాలు ఉండగా మొదటి విడదలో 6 వేల జీవాలకు వ్యాక్సిన్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వ్యాక్సిన్ పంపిణీకి ఐదు బృందాలను నియమించడం జరిగిందని, ఈ బృందాలు మండలంలోని గ్రామాలను సందర్శించి వ్యాక్సిన్ వేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నటి అసిస్టెంట్ అధికారి బి. పూర్ణచందర్, జెవివో రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు: డీఎంహెచ్‌వో

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 28: వైద్యశాఖలో ఉద్యోగాలను ఇప్పిస్తామని దళారుల మాటలను నమ్మి ఎవరు మోసపోవద్దు అని డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశాఖలో తాత్కాలిక, ఒప్పంద విభాగాలలో పోస్టుల భర్తీకై నియామకాలు జిల్లా కలెక్టర్ ప్రియాంక అల ఆధ్వర్యంలో రోస్టర్ పద్ధతిలో చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఉద్యోగాల కోసం ఔత్సాహికులైన అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దు అని, అర్హత పరీక్షల్లో వచ్చిన మార్కులను, రోస్టర్ ఆధారంగా పకడ్బందీగా చేపట్టడం జరుగుతుందన్నారు. ఎవరైన ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూళ్లు చేయడానికి ప్రయత్నిస్తే పోలీస్ సిబ్బందికి లేక వైద్య ఆరోగ్య శాఖకు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. దళారుల మాటలు ఎవరూ నమ్మవద్దని ఆమె కోరారు. నియామకాలు పారదర్శకంగా, కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వైస్ ఎంపీపీగా శైలజ ఏకగ్రీవం


నియామకపత్రం అందుకుంటున్న శైలజ

కరకగూడెం, ఫిబ్రవరి 28: కరకగూడెం మండల వైస్ ఎంపీపీగా కరకగూడెం ఎంపీటీసీ ఎలిపెద్ది శైలజ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరకగూడెం మండల వైస్ ఎంపీపీగా ఉన్న అయాబ్ ఖాన్ గత రెండు సంవత్సరాల క్రితం గుండె పోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి వైస్ ఎంపీపీ లేక పోవడంతో అధికారులు బుధవారం వైస్ ఎంపీపీ ఎన్నికను ఎంపీపీ రేగా కాళిక, ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా.. ఎలిపెద్ది శైలజను వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మునీంద్ర, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ బదిలీ

కొత్తగూడెం, ఫిబ్రవరి 28: జిల్లా అదనపు పి.రాంబాబును జగిత్యాల అదనపు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ములుగు అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డి. వేణుగోపాల్ నియమితులయ్యారు.

భూసేకరణ వేగవంతం చేయండి

కొత్తగూడెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి చేపడుతున్న భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో భూ సేకరణ ప్రక్రియపై రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఇరిగేషన్, సింగరేణి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్, మొదటి, రెండవ, మూడవ దశ ప్రాజెక్టులకు భూ సేకరణ, పులుసుబొంత ప్రాజెక్ట్, బీటీపీఎస్ రైల్వే లైన్ మణుగూరు, కరకగూడెం గ్రామాల ప్రజల ఆర్ అండ్ ఆర్ తదితర అంశాలపై చర్చించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూ సేకరణలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు, రైతులతో చర్చించి, సమస్యలు పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ భూ నిర్వాసితులకు చెల్లించే నష్ట పరిహారం 75 కోట్లు సాధ్యమైనంత త్వరగా చెల్లించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు పెండింగ్‌లో ఉన్న దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో గల ఎనిమిది గ్రామాలలో భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేసి వారంలోపు నివేదికను భద్రాచలం ఆర్డీఓకి అందజేయాలని తహశీల్దార్‌లను ఆదేశించారు. అదే విధంగా పులుసుబొంత ప్రాజెక్టు భూ సేకరణకు సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించి నివేదికను వారం రోజుల్లో నివేదికను భద్రాచలం ఆర్డీఓకి అందజేయాలని తహశీల్దార్‌లను ఆదేశించారు. బీటీపీఎస్ రైల్వే లేన్ మణుగూరుకు మణుగూరు, సమితి సింగారం, రామానుజవరం గ్రామాలలో భూ సేకరణ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి, రైల్వే లైన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి: జారే

దమ్మపేట, ఫిబ్రవరి 28: పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. దమ్మపేటలో బుధవారం పాయిల్‌తోటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభ గురువారం దమ్మపేటలోని అత్తులూరి వెంకటరామారావు పాయిల్ తోటలో ఉదయం 10 గంటలకు నిర్వహించటం జరుగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సభను విజయవంతం చేయాలని జారే కోరారు. అనంతరం సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి రాంచంద్రప్రసాదు, ఎంపీపీ సోయం ప్రసాదు, బండి భాస్కర్ రావు గంగాధరరావు, మన్నెం అప్పారావు, కేవి సత్యనారాయణ, ఎర్రా వసంతరావు, ఎర్రగొర్ల రాధాకృష్ణ, శ్రీరాముల ప్రసాదు, అత్తులూరి వెంకటరామారావు, కక్కిరాల రమేష్, చిన్నశెట్టి యుగంధర్, గోపి శాస్త్రి, పత్వేని ప్రసాదు, దొడ్డా బాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

దర్జీల సమస్యలను పరిష్కరిస్తా

దమ్మపేట, ఫిబ్రవరి, 28: మేర (దర్జీ)ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. టైలర్స్ డే కార్యక్రమాన్ని బుధవారం రిటైర్ట్ ఉద్యోగుల సంక్షేమసంఘం భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేర సంఘం అధ్యక్షులు గవరయ్య మాట్లాడుతూ దర్జీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని మేర కులస్థులు ప్రస్తుతం బిసి (డి)గా వున్నారని బీసీ ఏగా గుర్తించాలని, వడ్డీలేని రుణాలను అందించాలని కోరారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ దర్జీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు దమ్మపేట గీతాంజని పాఠశాలలో జరిగిన సైన్స్‌ఫెయిర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాదు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, కేవి సత్యనారాయణ, రాంబాబు, యుగంధర్, గోపిశాస్త్రి, రావెళ్ళ అజయ్‌కుమార్, సంఘం అధ్యక్షులు జగన్, గట్ల సతీష్, శ్రీనివాసరావు, నరసింహారావు, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరిపంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ములకలపల్లి, ఫిబ్రవరి 28: తాళ్లపాయి గ్రామంలో రబీలో సాగు చేసిన వరి విత్తనాలు సమయానికి ముందే వరిపంటలో కంకులు రావటంతో పలువురు రైతుల ఫిర్యాదు మేరకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు బుధవారం రైతులు సాగు చేసిన వరిపంటను పరిశీలించారు. రబీలో రైతులు ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటి సోనా వరి విత్తనాలు సాగు చేయగా రావల్సిన సమయానికి కంటే ముందుగా కంకులు రావటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులు అనిల్, రాంబాబు, వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారుల వరి పంటను పరిశీలించారు. పరిశీలించిన వారిలో ఏడీఏ రవి, లాల్‌చంద్, లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

జూలూరుపాడు, ఫిబ్రవరి 28: తన భర్తతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుందని అనుమానంతో తన బంధువులతో కలిసి అతని భార్య ఓ మహిళపై దాడి చేయడంతో అవమాన భారంతో సదరు మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాంచంద్రాపురం గ్రామానికి చెందిన మహిళ అదే గ్రామానికి చెందిన ఈసం శేఖర్‌తో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుందని అనుమానించి శేఖర్ భార్య ఈసం సుజాత తన బంధువులైన నిరోష, సునీతలతో కలిసి మంగళవారం సాయంత్రం సదరు మహిళ ఇంటికి వెళ్లింది. తన భర్తతో ఎందుకు అక్రమ సంబంధం పెట్టుకున్నావని నిలదీసి నోటికి ఇష్టమొచ్చినట్లు దుర్భాషలాడుతూ బంధువులతో కలిసి దాడి చేసింది. ఈ సంఘటనతో అవమాన భారంతో సదరు మహిళ తన మిర్చీ తోట వద్దకు వెళ్ళి పురుగు మందు సేవించి అపస్మారక స్థితిలో పడి ఉంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెకు చికిత్సలు అందించేందుకు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈసం సుజాత, చందా నిరోష, ఎట్టి సునీతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలి నరసింహారావు ఫిర్యాదు చేశాడు.